ఆందోళన చేస్తున్న బైపాస్ రోడ్డు బాధితులు

'బైపాస్' బాధితుల ఆందోళన

బచ్చన్నపేట, నవంబర్ 21: మండల కేంద్రంలో గురువారం బైపాస్ రోడ్డు బాధితులు బస్టాండ్ సమీపంలో ఆందోళన చేపట్టారు. జనగామ-సిద్దిపేట రోడ్డు జాతీయ రహదారిగా అభివృద్ధి చెందడంతో బైపాస్ చేపట్టాలని నేషనల్ హైవే అథారిటీ నిర్ణయించిందని, వ్యక్తుల ప్రయోజనాల కోసం గ్రామస్తుల ప్రయోజనాలు, ప్రజల రహదారి భద్రతలకు తిలోదకాలు ఇస్తోందని బాధితులు జిల్లా బుచ్చయ్య, రవి, వెంకట్‌రెడ్డి, భాస్కర్, మల్లయ్య, కిష్టయ్య, వెంకటయ్య, రమేశ్, కనుకయ్య, శకుంతల అన్నారు. రూ.లక్షలతో ప్లాట్లు కొన్నామని, అందులో నుంచే బైపాస్ రోడ్డు వెళ్తే తాము తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాన్ని రెండు భాగాలుగా విభజించేలా కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. గ్రామస్తులకు నిత్యావసర సేవలు అందించే రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాలు, మార్కెట్ యార్డును రహదారికి ఒక వైపునా, మరో పక్క పాఠశాలలు, గ్రామ పంచాయతీ, పోలీస్‌స్టేషన్‌లు ఉన్నాయని, రోడ్డును మధ్యలో నుంచి తీస్తే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతారని పేర్కొన్నారు. కొందరి స్వార్థం కోసం అన్ని అనుమతులు ఉన్న స్థలాల నుంచే బైపాస్ తీసేలా కుట్రలు జరుగుతున్నాయని, సంబంధిత అధికారులు కావాలనే వ్యవసాయ భూములుగా చూపించి తప్పుడు రిపోర్టులు ఇచ్చారని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు పూర్తి స్థాయి విచారణ జరిపి రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని, లేకపోతే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

అర్హులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి : కలెక్టర్

జనగామ చౌరస్తా, నవంబర్ 21: జిల్లాలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23, 24 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. 2025 జనవరి ఒకటి వరకు 18 ఏళ్లు పైబడిన వారు ఓటు హక్కు నమోదు చేసుకోవడానికి అర్హులన్నారు. ఓటరుగా పేరు నమోదు కోసం ఫారం-6, జాబితాలో అభ్యంతరాలు తెలపడానికి ఫారం-7, ఓటరు వివరాల్లో సవరణలు చేయడానికి (ఇంటి చిరునామా మార్పు, కొత్త ఈపీఐసీ, దివ్యాంగులుగా గుర్తింపు కోసం) ఫారం-8ని నింపి బూత్ లెవెల్ ఆఫీసర్లకు (బీఎల్వో) అందజేయాలని సూచించారు. ఆన్‌లైన్ వెబ్‌సైట్ ఐడీ voters.eci.gov.in లేదా ఓటర్ హెల్ప్‌లైన్ మొబైల్ యాప్ ద్వారా కూడా ఓటరుగా సులభంగా పేరు నమోదు చేసుకోవచ్చన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి : ఆర్డీవో

స్టేషన్ ఘన్‌పూర్: అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆర్డీవో డీఎస్ వెంకన్న అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 23, 24 తేదీల్లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎర్రబెల్లిని విమర్శించే అర్హత ఎమ్మెల్యేకు లేదు

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత మాజీమంత్రి దయాకర్‌రావుదే

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నవీన్, పాల్గొన్న నాయకులు

పాలకుర్తి, నవంబర్ 21: అభివృద్ధి ప్రదాత, ప్రజా నాయకుడు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును విమర్శించే అర్హత పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డికి లేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎఫ్ఎస్‌సీఎస్ బ్యాంక్ చైర్మన్ బొబ్బల ఆశోక్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకుర్తిలో ఎర్రబెల్లి దయాకర్‌రావు ఓడిపోతే ప్రజల గుండెలు పగిలిపోయాయన్నారు. యశస్వినీ రెడ్డికి ధైర్యం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని, నియోజకవర్గంలో ఎన్నికలు వస్తే ఎవరు గెలుస్తారో చూద్దామన్నారు. పాలకుర్తి నియోజకవర్గాన్ని దయాకర్‌రావు రూ. వందల కోట్లతో అభివృద్ధి చేశారని, ఎమ్మెల్యేగా యశస్వినీరెడ్డి గెలిచి ఏడాదికాలంలో ఏం అభివృద్ధి చేశారో ప్రజలకు తెలుపాలని, అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని, దయాకర్‌రావు ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలిచారన్నారు. మోసాలు, మాయమాటలతో, దొంగ ఏడుపులతో యశస్వినీరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారని ఎద్దేవా చేశారు. పాలకుర్తిలో టూరిజం అభివృద్ధి కోసం రూ.100కోట్లు కేటాయించారని, హరిత కాకతీయకు రూ.25కోట్లు మంజూరు చేశారని, ఏడాది గడిచినా టూరిజం పనులకు మోక్షం లేదన్నారు. తన జీతం ప్రజాసేవకే ఖర్చు చేస్తానన్న ఎమ్మెల్యే వేతనం ఎక్కడ ఖర్చు చేస్తోందో తెలుపాలన్నారు. ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు పాము శ్రీనివాస్, కడుదుల కర్ణాకర్‌రెడ్డి, గర్వందుల మల్లేశ్, దొంతమల్ల గణేశ్, ఒంటేల శ్రీనివాస్‌రెడ్డి, బానోత్ మహేందర్‌నాయక్, జోగు గోపి, పుస్కూరి కళింగరావు, వీరమనేని హనుమంతరావు, కమ్మగాని మధు, కోల నారాయణ, గాదెపాక శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు పాగాల సంపత్‌రెడ్డి విగ్రహావిష్కరణ

చిల్పూరు, నవంబర్ 21 : మండలంలోని రాజవరం ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన దివంగత జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి విగ్రహాన్ని నేడు(శుక్రవారం) ఉదయం 11 గంటలకు ఆవిష్కరించనున్నట్లు పార్టీ మండల రైతు బంధు కోఆర్డినేటర్ జనగామ యాదగిరి గురువారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అభిమానులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బాధితులకు ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శ

మౌనికను పరామర్శిస్తున్న దయాకర్‌రావు

దేవరుప్పుల, నవంబర్ 21: కడవెండి బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు తాటిపల్లి మహేశ్ సతీమణి మౌనిక అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. గురువారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆమెను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

నేటి నుంచి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

జఫర్‌గఢ్, నవంబర్ 21: జఫర్‌గఢ్ గ్రామ పడమటి కొండపై వెలసిన వేల్పుగొండ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు నేటి(శుక్రవారం) నుంచి 25 వరకు సీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకుడు సంగంపాలు వెంకటాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 22న స్వస్తివచనం, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, అంకురార్పణ, ప్రత్యేక పూజలు, అర్చనలు, స్వామికి ఆరగింపు, 23న సుప్రభాతం, సేవాకాలం, ప్రాభోదకి, పారాయణములు, మూర్తి కుంభ స్థాపన, అగ్నిప్రతిష్ఠ, సుదర్శనారసింహ హోమం, పూర్ణాహుతి, ధ్వజారోహనం, సాయంత్రం హనుమత్ వాహనంపై స్వామిని పురవీధుల గుండా ఊరేగింపు, 24న స్వామి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహిస్తామని పేర్కన్నారు. 25న శాంతి హోమం, మహాపూర్ణాహుతి, చక్రతీర్థం, సాయంత్రం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, అన్నదానం, స్వామి పల్లకీసేవ, శ్రీపుష్పయాగం, ద్వాదశారధనలు, ధ్వజారోహణం, ఆరగింపు కార్యక్రమాలు ఉంటాయన్నారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని అర్చకుడు కోరారు.

ఔషధ నియంత్రణ అధికారుల తనిఖీ

షాపులో తనిఖీ చేస్తున్న ఔషధ నియంత్రణ అధికారి బాలకృష్ణ

జనగామ చౌరస్తా, నవంబర్ 21: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం జిల్లా కేంద్రంలో ఔషధ నియంత్రణ అధికారి ఏలె బాలకృష్ణ పలు ఆయుర్వేద మందుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అభ్యంతరకరమైన ప్రకటనలతో విజయవాడకు చెందిన మాన్ ఫర్ ఆయుర్వేదిక్ డ్రగ్స్ కంపెనీ తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్న త్రిఫల పౌడర్‌ను స్థానికంగా విక్రయిస్తున్నట్లు గుర్తించి పట్టుకొని షాపును సీజ్ చేశారు. సదరు కంపెనీపై క్రిమినల్ కేసు సైతం నమోదు చేశారు.

దేవరుప్పలలో కార్తీకమాస పూజలు

ఉసిరిచెట్టుకు పూజలు చేస్తున్న మహిళలు

దేవరుప్పుల, నవంబర్ 21: కార్తీకమాస ప్రాముఖ్యతను చాటుతూ మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళలు గురువారం ఉసిరిచెట్టుకు పూజలు, వన మహోత్సవం నిర్వహించారు. సంఘం నాయకులు బుక్క రామయ్య, బెలిదె నర్సయ్య, గజ్జి సోమయ్య నేతృత్వంలో కార్యక్రమాలు చేపట్టగా, మహిళలు ఉసిరి, వేప-రావి చెట్లకు పూజలు చేసి మొక్కలు తీర్చుకున్నారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా సామూహికంగా ఆరగించారు. బీ అనంతలక్ష్మి, కే రజిత, భాగ్యలక్ష్మి, వీ గీత, వీ లత, వై కనకలక్ష్మి, రాజేశ్వరి, జీ రత్నమాల, పద్మ, బీ రమ, జయశ్రీ, భవానీ, బీ సోమలక్ష్మి, నిఖిత, వై మణి పూజ, లత, ఈ రమాదేవి, ఈ సావిత్రమ్మ, బీ ఆండాళు, అక్షర, సౌందర్య ఉన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్‌తో అనేక ప్రయోజనాలు

దేవరుప్పుల: జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులు

స్టేషన్ ఘన్‌పూర్/జఫర్‌గఢ్/ బచ్చన్నపేట/ నర్మెట/ తరిగొప్పుల/దేవరుప్పుల, నవంబర్ 21: చెకుముకి టాలెంట్ టెస్ట్‌తో విద్యార్థులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఎంఈవో జీ కొమురయ్య అన్నారు. గురువారం జేవీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి టాలెంట్ టెస్ట్‌లో 18 ప్రభుత్వ, ప్రైవేటు 18 పాఠశాలల నుంచి 60మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన వారు జిల్లాస్థాయి టెస్ట్‌కు ఎంపిక య్యారు. ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి ఎంఈవో కొమురయ్య డిక్షనరీలు, విశ్వ అవతరణకు సంబంధించిన పుస్తకాలు అందించి మాట్లాడారు. ఈ టెస్ట్ వల్ల మూఢనమ్మకాలపై అవగాహన, సృజనాత్మకత, ఆలోచన శక్తి పెరుగుతుందన్నారు. అదేవిధంగా జఫర్‌గఢ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జేవీవీ మండలశాఖ ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. జఫర్‌గఢ్, హిమ్మత్‌నగర్ పాఠశాలల హెచ్ఎంలు జీ పద్మ, మంగు జయ ప్రకాశ్ హాజరై మాట్లాడారు. పరీక్షలో కూనూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు శ్రీనిత్య, శ్రావ్య, భరత్, కేజీబీవీ విద్యార్థినులు కల్యాణి, ప్రియాంక, అపరంజిని విజేతలుగా నిలువగా, సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు ఈనెల 28న జనగామ లో జిల్లా స్థాయి చెకుముకి టెస్ట్‌లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. పరీక్షలో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంసా పత్రాలు అందించారు. విద్యార్థులకు హోప్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి పీ రాజిరెడ్డి స్నాక్స్, పెన్నులు అందజేశారు. బచ్చన్నపేటలో జేవీవీ ఆధ్వర్యంలో మండల కన్వీనర్ నర్సింహారావు అధ్యక్షతన నిర్వహించిన టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశం మరింత అభివృద్ధి చెందాలంటే సైన్స్‌లో అభివృద్ధి సాధించాలని, మూఢనమ్మకాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. 15 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొనగా, మూడు టీంలు జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించాయని, వీటిలో జడ్పీఎస్ఎస్ కొన్నె, వాణి హైస్కూల్ బచ్చన్నపేట, తెలంగాణ ఆదర్శ పాఠశాలలు ఉన్నాయన్నారు. నర్మెటలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు మండలంలోని అన్ని జడ్పీహెచ్ఎస్, కేజీబీవీ, మోడల్ స్కూల్, గిరిజన ఆశ్రమ బాలికల, సెయింట్ ఆన్స్ మరియపురం పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలుగా సెయింట్ ఆన్స్ మరియపురం విద్యార్థులు ఎం రిషిక, ఎం శివతేజ, కే సాత్విక, రెండో స్థానంలో జడ్పీహెచ్ఎస్ నర్మెట విద్యార్థులు లితిక, సాత్విక, భాను, మూడో స్థానంలో మోడల్ స్కూల్ విద్యార్థులు పీ ఐశ్వర్య, ఎం మానస, ఏ సానరిషి నిలిచారు. తరిగొప్పులలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చెకుముకి టాలెంట్‌టెస్ట్ నిర్వహించి ప్రతిభ చూపిన వారిని అభినందించారు. విద్యార్థుల్లోని ప్రతిభ, సృజనాత్మకతను వెలికి తీసేందుకు పరీక్షలు దోహదపడుతాయని వక్తలు అన్నారు. దేవరుప్పులలోని కామారెడ్డిగూడెం పాఠశాలలో చెకుముకి మండల కన్వీనర్ లక్ష్మజీ నేతృత్వంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. కడవెండి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సన్నీ, సమీక్ష, రిషిత, బాలయేసు ఉన్నత పాఠశాల నుంచి అర్జున్, సాత్విక్, సృజన్ జిల్లా స్థాయికి ఎంపికయ్యారని, వారికి ఎంఈవో కళావతి సర్టిఫికెట్లు అందజేశారు.

ముదిరాజ్‌లను బీసీ 'ఏ'లోకి మార్చాలి

- ఘనంగా మత్స్యకారుల దినోత్సవం
- జెండాను ఆవిష్కరించిన నాయకులు

పాలకుర్తి: ముదిరాజ్ జెండాను ఆవిష్కరించిన భిక్షపతి, పాల్గొన్న నాయకులు

తరిగొప్పుల: జెండాను ఆవిష్కరిస్తున్న ముదిరాజ్‌లు

పాలకుర్తి/ దేవరుప్పుల/ నర్మెట/ తరిగొప్పుల/ జనగామ రూరల్/ చిల్పూరు, నవంబర్ 21: ముదిరాజ్‌లను బీసీ డీనుంచి బీసీ ఏలోకి మార్చాలని ముదిరాజ్ మహాసభ నాయకుడు, ఆవిశ్రాంత సైనికుడు, డాక్టర్ కల్నల్ భిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో ముదిరాజ్ మహాసభ జిల్లా కార్యదర్శి కట్ల సదానందం, పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి చిక్కుడు రాములు, మండల అధ్యక్షుడు మాచర్ల ఎల్లయ్యతో కలిసి జెండా ఆవిష్కరించి మాట్లాడారు. ముదిరాజ్‌లంతా ఐక్యంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దాసరి మధు, మోకాటి కుమార్, మామిండ్ల లక్ష్మణ్, దుంపల సంపత్, మామిండ్ల సోమయ్య, దాసరి యాకయ్య పాల్గొన్నారు. అదేవిధంగా దేవరుప్పులలోని ముదిరాజ్ భవన్‌లో ఆవిర్భావ వేడుకలను ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు నర్ర సోమశేఖర్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ముదిరాజ్‌లు ఐక్యంగా ఉపాధి కల్పనకు ఉద్యమించాలన్నారు. సంఘ నాయకులు బీ యాకయ్య, బీ యాదగిరి, ఎన్ స్వామి, ఎన్ సోమయ్య, పీ రవి, సీ వీరయ్య, బీ నర్సయ్య, ఎన్ ఉప్పలయ్య, డీ సోమయ్య, డీ సంపత్, ఎన్ మహేశ్, కే యాకయ్య ఉన్నారు. నర్మెటలో ముదిరాజ్ భవన ఆవరణలో సంఘం అధ్యక్షుడు పులి మధుసూదన్ జెండాను ఆవిష్కరించారు. మత్స్యశాఖ సొసైటీ డైరెక్టర్లు పండుగ రాజరాం, పులి నర్సింహులు, పులి రాజయ్య, పులి రాజు, బండి సంజీవులు, పులి నరేశ్, పొన్నం బాలకృష్ణ, నవీన్ పాల్గొన్నారు. జనగామ రూరల్ మండలంలోని ఆయా గ్రామాల్లో ముదిరాజ్ జెండాను ఎగురవేశారు. శామీర్‌పేటలో జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్ నిమ్మల స్వామి పాల్గొని జెండా ఆవిష్కరించారు. ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో ముందుండాలని తెలిపారు. సొసైటీ సభ్యులు జీ ఉప్పలయ్య, పీ మహేందర్, ఎన్ మధు, సీ రఘుపతి, జీ మురళి పాల్గొన్నారు. తరిగొప్పులతో పాటు గ్రామాల్లో ముదిరాజ్ నాయకులు మత్స్యకారుల దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ చిలువేరు సంపత్, రాజు పాల్గొన్నారు. చిల్పూరు మండలంలోని చిన్నపెండ్యాల పెద్దమ్మగుడి ఆవరణలో జెండాను గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు నీల రాజు మాదిరాజ్ ఆవిష్కరించి మాట్లాడారు. ముదిరాజుల ఎజెండాను బలంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. సంఘం నాయకులు శాగ కుమారస్వామి, దారం వెంకన్న, శాగ రమేశ్, శ్రీనివాస్, సత్యనారాయణ, రాజమౌళి, హిమాద్రి, బొంబాయి శ్రీను, శ్రీనివాస్, ఆటో శ్రీనివాస్, నాగేశ్వర్, రాజన్‌బాబు, వెంకటేశ్వర్లు, యాకయ్య, నాగేశ్, రవి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

శ్రీహాన్(ఫైల్)

స్కూల్ బస్సు కిందపడి బాలుడి మృతి

కొడకండ్ల, నవంబర్ 21: స్కూల్ బస్సు కిందపడి బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని చెరువు ముందు తండాలో గురువారం జరిగింది. దేవరుప్పుల ఎస్సై సృజన్‌కుమార్, కొడకండ్ల ఏఎస్సై కత్తి రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. చెరువు ముందు తండా పరిధిలోని రాతిరాం తండాకు చెందిన వాంకుడోత్ మహేశ్వరి- రమేశ్ దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తెను బాలయేసు పాఠశాల బస్సు ఎక్కిస్తుండగా కుమారుడు శ్రీహాన్(2) బస్సు ముందు టైర్ వద్ద ఉండడంతో డ్రైవర్ గమనించకుండా బస్సును ముందుకు పోనివ్వగా బాలుడు టైర్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సృజన్‌కుమార్, ఏఎస్సై రమేశ్ తెలిపారు.

కేజీకేఎస్ కరపత్రాల ఆవిష్కరణ

దేవరుప్పుల: శ్రీకాంత్‌గౌడ్‌కు ఆహ్వానపత్రం అందిస్తున్న కేజీకేఎస్ నాయకులు

స్టేషన్ ఘన్‌పూర్, నవంబర్ 21: జిల్లా కేంద్రంలో ఈ నెల 30న నిర్వహించనున్న కేజీకేఎస్ జిల్లా సదస్సు కరపత్రాలను సంఘం మండల అధ్యక్షుడు మాచర్ల రఘురాములు గురువారం కొత్తపల్లిలో కల్లుగీత కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో గీత కార్మికుల సంక్షేమానికి రూ.5వేల కోట్లు కేటాయించాలని, టాడి కార్పొరేషన్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గీత కార్మికులకు అందిస్తున్న పెన్షన్‌ను ఎలాంటి షరతులు లేకుండా 50 ఏళ్లు నిండిన ప్రతి గీత కార్మికుడికి వర్తింపజేయాలన్నారు. జీవో 560 ప్రకారం ప్రతి సొసైటీకి ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి ఇవ్వాలని, జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలన్నారు. జిలా సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కొత్తపల్లి సొసైటీ అధ్యక్షుడు బూరు వెంకటేశ్వర్లు, గట్టు చిన్నకుమార్, గట్టు సతీశ్, రవి, కే బాలరాజు, కుమార్, రమేశ్, యాదగిరి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి ఆహ్వానం

దేవరుప్పుల: జిల్లా కల్లుగీత కార్మిక సంఘం పదో జిల్లా సదస్సుకు రావాలని కేజీకేఎస్ నాయకులు మండల బీఆర్ఎస్ నాయకుడు బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్‌కు ఆహ్వానం పలికారు. కల్లుగీత కార్మిక సంఘం పదేళ్ల ప్రయాణం పేరుతో దశాబ్ది ఉత్సవాలు, సదస్సును జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న నేపథ్యంలో విజయవంతానికి తమ తోడ్పాటు కావాలని కేజీకేఎస్ జిల్లా అధ్యక్షుడు కుర్ర ఉప్పలయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్దె వెంటక మల్లయ్యగౌడ్ ఆయనను కోరారు.

'గ్రూప్-2 మాక్ టెస్టు'కు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ చౌరస్తా, నవంబర్ 21: గ్రూప్-2 పరీక్ష మాక్ టెస్టులకు హాజరు అయ్యేందుకు జిల్లాలో అర్హులైన మైనార్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మైనార్టీ సంక్షేమశాఖ అధికారి బీ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 2, 3, 9, 10 తేదీల్లో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు మాక్ టెస్ట్ ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 29లోపు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

'జిల్లా సైన్స్ అధికారి' పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలి

జనగామ చౌరస్తా, నవంబర్ 21: 'జిల్లా సైన్స్ అధికారి'గా బాధ్యతలు నిర్వర్తించడానికి ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు లేదా స్కూల్ అసిస్టెంట్స్ నుంచి ఈనెల 25లోపు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో కే రాము ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు మ్యాథ్స్, సైన్స్ నేపథ్యం కలిగి ఉండాలని పేర్కొన్నారు.

ఘనంగా దివ్యవిమాన రథోత్సవం

- మాడవీధుల్లో స్వామివారి ఊరేగింపు
- ఉత్సాహంగా పాల్గొన్న భక్తులు

రథం ఎదుట యాగం, బలి పూజా చేస్తున్న పూజారులు

లింగాలఘనపురం, నవంబర్ 21: జీడికల్ సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో మరో కీలక ఘట్టాన్ని గురువారం పూర్తి చేశారు. రథాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలు, మామిడి, పూల తోరణాలతో అలంకరించి మాడ వీదుల్లో ఊరేగించారు. దివ్యవిమాన రథాన్ని ఆలయం ఎదుట ప్రధాన గవాక్షం వద్దకు తీసుకొచ్చి అలంకరించారు. సీత, రామ లక్ష్మణ, హనుమ ఉత్సవ విగ్రహాలను రథంపై చేర్చి ఊరేగించారు. అనంతరం ఆరగింపు, తీర్థగోష్ఠి కార్యక్రమాలతో రథోత్సవ సంబరం ముగిసింది. ఈవోలు లక్ష్మీప్రసన్న, వంశీ, కేకే రాములు, ఆలయ చైర్మన్ ఏలె నరసింహమూర్తి, సిబ్బంది భరత్‌కుమార్, రాజేందర్‌రెడ్డి, మల్లేశం పూజారులు గట్టు శ్రీనివాసాచార్యులు, విజయసారథి, బుచ్చయ్యశర్మ, గట్టు రఘురాం, రాఘవ, భార్గవాచార్యులు, మురళీకృష్ణమాచార్యులు ఆలయ డైరెక్టర్లు, మంద శ్రీధర్ రెడ్డి, కడకంచి లక్ష్మి, మొటికె శ్రీశైలం, ఉపేందర్ పాల్గొన్నారు.

కేయూ డాక్టరేట్స్ అసోసియేషన్ ఏర్పాటు

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 21 : కాకతీయ యూనివర్సిటీలో మొదటిసారిగా అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్స్(ఏకేయూడీ) నూతన కార్యవర్గాన్ని వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కొల్లు నర్సింహారావు ఆధ్వర్యంలో గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్ రంగారెడ్డి, చిలువేరు రాజ్‌కుమార్ ఎన్నికైనట్లు ప్రకటించారు.

ఆగిఉన్న లారీని ఢీకొట్టిన ద్విచక్రవాహనం

ఒకరి మృతి, మరొకరికి తీవ్రగాయాలు

కొడకండ్ల, నవంబర్ 21: ఆగిఉన్న లారీని బైక్ ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని మైదాం చెరువుతండాలో గురువారం రాత్రి జరిగింది. దేవరుప్పుల ఎస్సై సృజన్, కొడకండ్ల ఏఎస్సై కత్తి రమేశ్ కథనం ప్రకారం.. సుర్యాపేట జిల్లా, తిరుమలగిరి మండలం, తాటిపాముల గ్రామానికి చెందిన వనమాల వెంకన్న (52), వాణి (ధనలక్ష్మి)దంపతులు బైక్‌పై తిరుమలగిరిలో బంధువుల ఫంక్షన్‌కు వచ్చి వెళ్తున్న క్రమంలో మైదాం చెరువుతండా వద్ద ఆగిఉన్న లారీని ఢీకొట్టాడు. దీంతో వెంకన్న అక్కడికక్కడే మృతి చెందగా, అతడి భార్య వాణికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను 108వాహనంలో జనగామ ఏరియా దవాఖానకు తరలించినట్లు ఎస్సై సృజన్, ఏఎస్సై రమేశ్ తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసి